క్లుప్తంగా...

మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు అందుబాటులో ఉండాలి

లాలాపేట: భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలనీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి సూచించారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయం నుంచి వర్షాకాల పరిస్థితులపై ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. గత రెండు రోజుల నుంచి నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా గుంతలు పూడ్చాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాకాలం ముగిసే వరకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నగరవాసులు అత్యవసర సహాయం కోసం 040–21111111 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్, కుందన్‌బాగ్, గ్రీన్ ల్యాండ్స్, లోధా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, టోపాజ్ బిల్డింగ్, నవదుర్గా జ్యువెలర్స్, ఏరియల్ టవర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మా టీవీ బిల్డింగ్, మా టీవీ లేన్, హిందూ ప్రెస్, పుల్లారెడ్డి స్వీట్స్, స్నేహలత బిల్డింగ్, డీఎస్ఎం కాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ–మార్ట్ ఎదురు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

అమీర్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వాన్ని అందిపుచ్చుకోవాలని కల్నల్ రాకేష్‌కుమార్ సూచించారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ఎస్ఆర్‌నగర్ రవీంద్రభారతి స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన హాజరై స్కూల్, క్లాస్ లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు

పోషకాహారాన్ని సమతుల్యం చేయడంలో

వంట నూనెల పాత్ర కీలకం

సనత్‌నగర్: పోషకాహారాన్ని సమతుల్యం చేయడంలో ఎడిబుల్ ఆయిల్ (వంట నూనె) ఎంతో అవసర మని పలువురు ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు. వ ంట నూనెలపై ఉన్న అపోహలు, నూనెల వల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం బేగంపేటలోని ఐటీ సీ కాకతీయ హోటల్‌లో చర్చావేదిక నిర్వహించారు. ఫ్రీడమ్ ఆయిల్ నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా 'వంట నూనెల పట్ల ఉన్న అపోహలను పోగొట్టుకోండి' అనే అంశంపై సాగిన చర్చా కార్యక్రమానికి ఆహార, ఆరో గ్య, వైద్య, పాకశాస్త్ర నిపుణులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.అపోలో ఆస్పత్రి చీఫ్ డైటీషియన్ హరిత బత్తిన మాట్లాడుతూ.. అన్ని రకాల వంట నూనెలతో బరువు పెరుగుతుంది అనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. సమతుల్య ఆహారంలో నూనె ముఖ్యమైన భాగమని ప్రతి రకమైన నూనె దాని ప్రత్యేక ప్రయోజనాలు, లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్–ఈ పుష్కలంగా ఉంటాయన్నారు. అపోలో ఆస్పత్రి కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కల్నల్ మంత్రిప్రగడ సీతారాం మాట్లాడుతూ.. రైస్ బ్రాన్ ఆయిల్ బహుళ ప్రయోజకరమైన లక్షణాలను కలిగి ఉండడంతో పాటు వంటకు వినియోగించడానికి ఉత్తమమైనదిగా పరిశోధనల్లో తేలిందన్నారు. మదీనా డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్ హెచ్ఓడీ న్యూట్రిషన్ డాక్టర్ నస్రీన్ మాట్లాడుతూ.. వంట నూనెలు శరీరానికి అవసరమైన కొవ్వు ఆమ్లాలు, కొవ్వులో కరిగే విటమిన్లు, ఇతర ముఖ్యమైన పోషకాలను అందిస్తాయన్నారు. దత్తాత్రే హాస్పటాలిటీ కన్సల్టెన్సీ సర్వీసెస్ చెఫ్ కన్సల్టెంట్ అండ్ సీఈఓ కిరణ్ జోషి, జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై నూనెల ప్రాముఖ్యతను వివరించారు.

యువకుడి అదృశ్యం


బంగారు రమేష్

బౌద్ధనగర్: బోనాల జాతరకు వెళ్లొస్తానని వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివ రాల ప్రకారం.. ముషీరాబాద్ బాపూజీనగర్‌కు చెందిన బంగారు రమేష్ (18) ఈ నెల 16న బోనాల జాతరకు వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన తల్లి ఫోన్ చేయగా గా సిచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాన్‌షాపులో చోరీ

బౌద్ధనగర్: తాళం వేసి ఉన్న పాన్ షాపులో చోరీ జరిగిన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వారాసీగూడలోని బీవైటీ వైన్‌షాపు పక్కన ఉన్న పాన్ షాపులో సోమవారం రాత్రి తాళం పగులగొట్టి రూ.2 వేల నగదు, సిగరెట్ పాన్ మసాలా ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

- సీఈఓలకు రక్షణ శాఖ ఉత్తర్వులు
- 'మరమ్మతు' సాకుతో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు
- సహించొద్దంటూ రక్షణ శాఖ పెద్దలు ఆదేశాలు


బేగంపేట ఎయిర్‌పోర్టు గోడ సమీపంలోని ఓల్డ్ గ్రాంట్ బంగళా స్థలంలో రాత్రిపూట కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

కంటోన్మెంట్: 'కంటోన్మెంట్‌లలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు.. సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది' అంటూ పార్లమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ రాజేంద్ర అగర్వాల్ నేతృత్వంలోని కమిటీ అభిప్రాయపడింది. ఈ నెల ఆరో తేదీన మీరట్‌లో భేటీ అయిన కమిటీ రక్షణ శాఖ ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నలతో పాటు పలు సూచనలు చేసింది. తదనుగుణంగా డీజీడీఈ కార్యాలయ అధికారులు దేశంలోని అన్ని కంటోన్మెంట్‌ల సీఈఓలు, డీఈఓలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'రిపేయిర్స్' పేరిట అక్రమ నిర్మాణాల్లో జరిగే మరమ్మతులను ఉపేక్షించ వద్దని సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టే నిర్మాణాలకు 'పీపీఈ' నోటీసులు జారీ చేయడంతో కోర్టులలో ప్రభుత్వ వాదనలను సమర్థంగా వినిపించాలని ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, ఆక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని పేర్కొన్నారు. బోర్డు దృష్టికి వచ్చిన అక్రమ నిర్మాణాలను సీఈఓ లేదా సంబంధిత అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాల్సిందే అని స్పష్టం చేశారు.

ఏమిటీ మరమ్మతు ?

భవన నిర్మాణ మరమ్మతులకు సంబంధించి కీలక సవరణలు చేస్తూ రక్షణ శాఖ 2019 డిసెంబర్‌లో ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చింది. కంటోన్మెంట్‌లలో భవనాల మరమ్మతులకు సంబంధించి 'ల్యాండ్ పాలసీ 1995'లో స్పష్టత లేదంటూ, కంటోన్మెంట్ బోర్డుల పనితీరుపై ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ అభిప్రాయ పడింది. ఈ నేపథ్యంలో ది కంటోన్మెంట్స్ యాక్ట్ 2006, సెక్షన్ 235 ప్రకారం నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేని 'రిపేయిర్స్' జాబితాను రూపొందించాలని కమిటీ సూచించింది. తదనుగుణంగా బోర్డు పరిధిలోని అనుమతులతో నిర్మించిన భవనాల్లో మరమ్మతులకు సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత బోర్డులలో చర్చించి, ప్రజలకు సమచారం ఇవ్వాలి అంటూ బోర్డుల పరిపాలన అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

వారిని వేధించొద్దు..

'మెటీరియల్ ఆల్టరేషన్' నిబంధన బోర్డు అనుమతి పొందిన భవనాలకు మాత్రమే వర్తిస్తుందని భావించిన అధికారులు, ఓల్డ్ గ్రాంట్ బంగళాల్లో మరమ్మతులను అడ్డుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ గత నెలలో మరో కీలక ఉత్తర్వులు వెలువరించింది. జనరల్ ల్యాండ్ రికార్డ్స్ ప్రకారం 'హోల్డర్ ఆఫ్ ఆక్యుపెన్సీ రైట్స్' (హెచ్ఓఆర్)లో పేర్కొన్న వ్యక్తి కాకపోయినప్పటికీ, ఇతరులు ఎవరైనా ఓల్డ్ గ్రాంట్ బంగళాల్లో రిపేయిర్స్ చేసుకునేందుకు బోర్డు అనుమతి పొందాల్సిన అవసరం లేదు అని పేర్కొంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది సాధారణ ప్రజానీకాన్ని వేధించొద్దు అంటూ కఠినంగా హెచ్చరించింది. నిబంధనలు పాటించే వారిని వేధించొద్దు అంటూనే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే అంటూ రక్షణ శాఖ ఉన్నతాధికారులు పేర్కొనడం గమనార్హం

ముగిసిన చిలకలగూడ బోనాల జాతర


జాతరలో చిందేస్తున్న నాయకులు


చిలకలగూడ బోనాల జాతరకు హాజరైన ప్రజలు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతర వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. సోమవారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు, సాగునంపు యాత్రకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు పలువురు ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద నృత్యాలు చేశారు. బీఆర్ఎస్ వేదికపై డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు, కార్పొరేటర్లు సామల హేమ, సునీత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్, బీజేపీ నాయకులు బగ్గ హరీష్, ఫణీష్‌ల నేతృత్వంలోని వేదికపై మహంకాళి బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, బండపల్లి సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మహేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపులో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. బోనాల జాతరను ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన చిలకలగూడ పోలీసులు, జీహెచ్ఎంసీ, పలు విభాగాల అధికారులకు ఈఓ మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు కరాటే రాజు, జలంధర్‌రెడ్డి, రాజుసుందర్, సుంకు రామ్‌చందర్, పొగర్తి భువన్‌రావు, కాసరబాద వెంకటేష్, భరత్‌జైన్, జగ్గు, సురేష్‌లాల్, షకీల్‌ఖాన్, బిట్ల రఘునందన్, అభిషేక్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఘటాల ఊరేగింపులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ముత్యాలమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల దేవాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో బోనాల జాతర వేడుకలు జరుగనున్నాయి. వేడుకల నేపథ్యాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయం నుంచి ఘటాల ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమైంది. చిలకలగూడ అమ్మవారి ఆలయంలో నిర్వహించే బోనాల జాతర తర్వాతి వారం మేడిబావిలో బోనాల వేడుకలు నిర్వహించడం అనాదిగా సంప్రదాయంగా వస్తుంది. ఒకే ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ముత్యాలమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం రానున్నట్లు అంచనా వేసిన నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు


అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన ఘటాల ఊరేగింపు

చేస్తున్నారు. బోనాలతో వచ్చే మహిళలు, సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనం కోసం వేర్వేరుగా క్యూలైన్ల బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పరికిబండ మోహన్, రాచమల్ల సంగీత్ తెలిపారు.

కాలనీలు, బస్తీల్లో పర్యటించండి

కార్పొరేటర్లకు మంత్రి తలసాని సూచన


కార్పొరేటర్లు, నాయకులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ప్రజా సమస్యలపై వారంలో రెండు రోజులు తమ తమ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో పర్యటించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. 50, 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులను గడిచిన తొమ్మిదేళ్లలో పూర్తి చేశామన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని, వాటిని తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి వివరించారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు గృహ లక్ష్మి పథకం త్వరలో ప్రారంభం కానుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, ఆకుల రూప, అరుణగౌడ్, కిరణ్మయి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి, పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేష్, రాజు, హన్మంతరావు పాల్గొన్నారు.

బోనాల జాతర ప్రారంభం


పూజలో పాల్గొన్న దేవేందర్, జంపన ప్రతాప్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో శ్రావణ మాస బోనాల జాతర మంగళవారం నుంచి ప్రారంభమైంది. కంటోన్మెంట్ బోర్డు వర్క్‌షాపులో బోర్డు శానిటేషన్ విభాగం సూపరింటెండెంట్ దేవేందర్ ఆధ్వర్యంలో వర్క్‌షాపులోని ఆలయంలో కొలువైన మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, శానిటేషన్ విభాగం దఫేదార్లు రాజేష్, గణేష్, రామకృష్ణ, సూరి, వర్క్‌షాపు డ్రైవర్లు, స్టోర్, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తలసానికి ఆహ్వానం..

బోర్డు పరిధిలోని మూడో వార్డు బాలంరాయి శ్రీదేవి దండుమారమ్మ ఆలయ బోనాలు వచ్చే ఆదివారం జరగనుండడంతో ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పలువురు మారేడుపల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి గోపాల్, రమేష్, ధర్మేందర్, సర్వేష్, మహేష్, దర్గా రవికుమార్, వేణుగోపాల రెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ట్రాఫిక్ పోలీసులకు అవగాహన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బైబిల్ హౌస్ సమీపంలోని మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్ రాజు, ఉస్మానియా వైద్యులు డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ యాసీన్ తిప్పు, డాక్టర్ యుజ్మ సీపీఆర్, ఫిట్స్, ఊపిరితిత్తుల పునరుజ్జీవనం, ప్రాథమిక చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో వైద్య పరంగా ఎలాంటి సహకారం అందించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా ఊపిరితిత్తులను పునరుజ్జీవం జరిగేలా ప్రాథమిక చికిత్స అందించాలో డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణతో పాటు ఎవరైనా


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆకస్మికంగా అస్వస్థతకు గురైతే వైద్యులుగా మారి వైద్య సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఎంతో మంది వాహనచోదకులు, పాదచారులు వెళ్తుంటారు. వారిని ఆరోగ్యపరంగా ఆదుకోవాలన్నారు.

నాలాలో పడిన ఆవు

కాపాడిన స్థానికులు


నాలాలో పడిన ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

చిలకలగూడ : మురుగునీటి నాలాలో పడిన ఆవును కాపాడి బయటకు తీసిన ఘటన మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో జరిగింది. స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత వివరాల ప్రకారం.. ఆలుగడ్డబావి ముత్యాలమ్మ ఆలయ సమీపంలోని గడ్డిచేల వద్దకు మంగళవారం ఓ ఆవు ఓపెన్ నాలాలో పడి అరవడాన్ని స్థానికులు గమనించారు. రక్షించేందుకు యత్నించేలోగా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో కొంతదూరం కొట్టుకుపోయింది. దూద్‌బావి వరకు నాలాకు పైకప్పు ఉండడంతో మధ్యలో చిక్కుకుపోయే అవకాశం ఉందని భావించిన కార్పొరేటర్ సునీత, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్ఎఫ్ బృందంలో పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికులు దూద్ బావి ఓపెన్ నాలా వద్దకు చేరుకుని ప్రవాహంతో కొట్టుకువచ్చిన ఆవును నాలుగు గంటల పాటు శ్రమించి బయటకు తీసి యజమాని సాయియాదవ్‌కు అప్పగించారు. గోమాతను రక్షించేందుకు కృషి చేసిన కార్పొరేటర్ సునీత, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందంతో పాటు స్థానికులను అభినందించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా


స్థానికులతో మాట్లాడుతున్న గజ్జెల నాగేష్

రసూల్‌పురా: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో మంగళవారం ఆయన పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు రావడం లేదని, సదరం సర్టిఫికెట్ తీసుకునేందుకు అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కంటోన్మెంట్ బోర్డు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు బీఆర్ఎస్ నాయకులు జంగిలి రాజు, నర్సింగ్, నగేష్‌యాదవ్, కిట్టు, యాదగిరి పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి వినతి


డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫాదర్లు

లాలాపేట: హైదరాబాద్ ఏసీ గార్డ్స్ ప్రాంతానికి చెందిన హోలీ చర్చి క్రైస్తవ సంఘం ప్రతినిధి బృందం మంగళవారం తార్నాకలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని కలిసి చర్చి వద్ద నెలకొన్న పారిశుద్ధ్యం సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. చర్చి ప్రధాన ద్వారం వద్ద ఉన్న చెత్త డంపర్ బిన్స్‌తో ఆ పరిసరాలన్నీ దుర్గంధంగా మారి చర్చికి వచ్చే భక్తులతో పాటు చర్చి కాంపౌండ్‌లో కొనసాగుతున్న రోచ్ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మైకిల్ సెల్వరాజ్, అనీల్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమకు ప్రభుత్వం దన్ను



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయేష్ రంజన్

సనత్‌నగర్: పునర్వినియోగ ప్లాస్టిక్ పరిశ్రమ స్థిరమైన అభివృద్ధికి, ప్రోత్సాహకానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ స్పష్టంచేశారు. ఆగస్టు 4 నుంచి 7 వరకు 'హిప్లెక్స్' పేరిట హైటెక్స్‌లో జరగనున్న ప్లాస్టిక్ పరిశ్రమకు సంబంధించిన ఎక్స్‌పో సన్నాహక కార్యక్రమం మంగళవారం సాయంత్రం బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగింది. ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ సౌత్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి వెన్నమ్ పలు సమస్యలను ప్రస్తావించారు. అనేక కారణాల వల్ల ప్లాస్టిక్ పరిశ్రమ తీవ్ర ఒత్తిడికి గురవుతోందన్నారు. 18 శాతం జీఎస్‌టీ విధించడం వల్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ముఖ్యంగా ఈ రంగంలో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై పెనుప్రభావం పడుతుందన్నారు. జీఎస్‌టీని 12 శాతం తగ్గించడం వల్ల చిన్న చిన్న కంపెనీలకు మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జయేష్ రంజన్ మాట్లాడుతూ జీఎస్‌టీ కౌన్సిల్‌లో సభ్యుడైన హరీష్‌రావుతో ప్లాస్టిక్ పరిశ్రమలపై జీఎస్‌టీ తగ్గింపు విషయమై చర్చిస్తానన్నారు. రాష్ట్రంలో పది వేల ప్లాస్టిక్ యూనిట్లు ఉన్నప్పటికీ చాలా కంపెనీలు తాప్మా సభ్యత్వం తీసుకోలేదన్నారు. డిసెంబర్ నుంచి ప్లాస్టిక్ యూనిట్లకు ప్రోత్సాహకాల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టులో జరిగే ఎక్స్‌పోకు 400 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 50,000 మంది సందర్శకులు పాల్గొనడం వల్ల రాష్ట్రంలోకి కొత్త పెట్టుబడులు రావడానికి సహాయపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ పరిశ్రమకు చెందిన పలువురు నిపుణులు పాల్గొన్నారు.

దుకాణదారుడిపై దాడి చేసిన నలుగురికి జైలు


జైలు పాలైన యువకులు

అమీర్‌పేట: కిరాణ షాపులో కూల్ డ్రింక్స్ తీసుకుని డబ్బులు ఇవ్వకపోగా, షాపు నిర్వాహకుడిపై దాడి చేసిన నలుగురికి జైలు శిక్ష విధించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బాపూనగర్‌లో రాజుకు కిరాణ షాపు ఉంది. ఆదివారం రాత్రి నలుగురు యువకులు అక్కడికొచ్చి స్ప్రైట్ కొనుగోలు చేసి పది రూపాయలు తక్కువగా ఇచ్చారు. మొత్తం డబ్బులు ఇవ్వాలని అడగడంతో మాటామాట పెరిగి నలుగురు కలిసి రాజుపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాఖీ ఫిలిప్స్, మహ్మద్ మాజ్ ఖాన్, మహ్మద్ అర్బజ్, మహ్మద్ టైమర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లిలోని 10వ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్‌రావు 18 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తికి..

అమీర్‌పేట: మద్యం తాగి గొడవపడటమే కాకుండా అక్కడికి వచ్చిన పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తికి 8 రోజుల జైలు శిక్ష విధించారు. నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి మద్యం తాగి ఎస్ఆర్‌నగర్‌లో తిరుగుతూ బాటసారులతో గొడవ పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా మరింత రెచ్చిపోయిన నాగేశ్వర్‌రావు పోలీసులను దుర్భాషలాడాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

62 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: రైలులో అక్రమంగా రవాణా చేస్తున్న 62 కిలో గంజాయిని సికింద్రాబాద్ రైల్వే రక్షణదళం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబస్మిత చటోపాధ్యాయ బెకర్జీ కథనం ప్రకారం.. ఆపరేషన్ నార్కోస్‌లో భాగంగా మఫ్టీ దుస్తుల్లో ఆర్‌పీఎఫ్‌కు చెందిన మహిళా పోలీసు బృందాలను ఈనెల 17న డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో మూకుమ్మడి తనిఖీలకు దింపారు. ఇందులో భాగంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఖమ్మం నుంచి కాజీపేట వరకు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇరువురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాగులను తనిఖీ చేయగా అందులోంచి 62 కిలోల గంజాయి బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో 21 రైళ్లలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6.7కోట్ల విలువ చేసే గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని 23 మంది నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి పాకెట్లు

'బీజేపీ అధికారంతోనే రాష్ట్రం అభివృద్ధి'


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: బీజేపీ అధికారంతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్‌లోని కంజర్ల లక్ష్మినారాయణయాదవ్ పార్కులో మంగళవారం నిర్వహించిన 'టిఫిన్ డబ్బా–ఇష్టాగోష్టి' కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం ఆలోచించే బీజేపీకి పగ్గాలు అప్పజెప్పడం ద్వారా రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని సూచించారు. శ్యాంసుందర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, కార్పొరేటర్లు దీపిక, సుచిత్ర శ్రీకాంత్, సరళ, నాయకులు షేక్‌గౌస్, దయానంద్, శ్రీనివాస్, మహేష్, దయానంద్‌రావు పాల్గొన్నారు.

చిలకలగూడలో 'బీజేపీ టిఫిన్ బాక్స్ బైఠక్'

చిలకలగూడ : బీజేపీ తొమ్మిదేళ్ల పాలనపై మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలకలగూడలో టిఫిన్ బాక్స్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లోనూ దేశం సాధించిన ప్రగతిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని చర్చించారు. సికింద్రాబాద్ బీజేపీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండపల్లి సతీష్, రవిప్రసాద్, నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, హరి, ప్రభుగుప్తా, శారదమల్లేష్, మహేష్, గణేష్‌ముదిరాజ్, సత్యనారాయణ, అనూష, అనిత, కీర్తి, రాముపర్మ, హనుమంతు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బొల్లారంలో..

రసూల్‌పురా: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బొల్లారంలో బీజేపీ నాయకులు మంగళవారం టిఫిన్ బైఠక్ నిర్వహించారు. బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ మంత్రి విజయరామరావు ఇతర నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గరీబ్ కల్యాణ్, వోకల్ ఫర్ లోకల్, డిజిటల్ ఇండియా, నియోజకవర్గం సంస్థాగత విషయాలు, భవిష్యత్తు కార్యచరణ, అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల అభ్యర్థన, సలహాలు, సూచనలు ఇతర అంశాలపై చర్చించారు.

